# నమస్తే తెలంగాణ

# భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, సోమవారం 18 నవంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM





వివరాలు వెల్లడిస్తున్న సీపీ, ఇన్‌సెట్‌లో ఆయుధాలు

# ఖమ్మంలో అక్రమ ఆయుధాల కలకలం

- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు, పరారీలో మరొకరు
- మూడు పిస్టళ్లు, మ్యాగ్జిన్లు, 17 బుల్లెట్లు, బైకు స్వాధీనం: సీపీ

మామిళ్లగూడెం, నవంబర్ 17: ఖమ్మంలో అక్రమ ఆయుధాల ఘటన కలకలం రేకెత్తిస్తున్నది. అక్రమంగా ఆయుధాలు కలిగిన ఇద్దరు నిందితులను పోలీసులు విచారిస్తున్నారు. ఆదివారం వాహనాలను తనిఖీ చేస్తున్న నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద పిస్టళ్లు లభించాయి. ఖమ్మం కస్బాబజార్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు, బయ్యారం మండలం కొత్తపేట గ్రామానికి చెంది ప్రస్తుతం నగరంలోని ఖానాపురంలో నివాసముంటున్న మరో వ్యక్తి ముఠాగా ఏర్పడి రియల్ ఎస్టేట్ వ్యాపారం ముసుగులో అక్రమ దందాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో ఇద్దరు ప్రధాన నిందితులు పోలీసుల అదుపులో ఉండగా మరో నిందితుడు పరారీలో ఉన్నారు. నిందితులు అక్రమ వసూళ్లకు పాల్పడడంతోపాటు రియల్ దందాలో బడా వ్యాపారులు, ఇతర వ్యాపారులకు ఆయుధాలు సరఫరా చేశారా? లేక వీరే వినియోగించి బెదిరింపులకు పాల్పడుతూ దందాలు కొనసాగిస్తున్నారా? అనేది పోలీసుల విచారణలో తేలనున్నది. నిందితులపై గార్ల, బయ్యారం, మరిపెడ, మహబూబాబాద్, ఖమ్మం త్రీటౌన్, వన్‌టౌన్ స్టేషన్లలో గతంలో కేసులు నమోదై ఉన్నాయి.

**పూర్తిస్థాయి విచారణ కొనసాగుతుంది: సీపీ**

అక్రమ ఆయుధాలు కలిగి దందాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామని సీపీ సునీల్‌దత్ తెలిపారు. ఖమ్మం త్రీ టౌన్ పీఎస్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఖమ్మం ప్రకాశ్ నగర్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో బైకుపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు త్రీటౌన్ పోలీసులను వాహనం వదిలిపెట్టి పారిపోయేందుకు ప్రయత్నింరు. వెంటనే త్రీటౌన్ పోలీసులు వారిని పట్టుకొని విచారణ చేపట్టారు. వారు ఖమ్మం కస్బాబజార్‌కు చెందిన మహ్మద్ అప్సర్, ఖానాపురానికి చెందిన గుండమల్ల వెంకటేశ్వర్లుగా తెలింది. వారి వద్ద తనిఖీలు నిర్వహించగా పిస్టళ్లు–3, మ్యాగ్జిన్లు–4, బుల్లెట్లు–17, ఒక బైకు లభించాయి. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. వారితోపాటు మహ్మద్ రియాజ్ అనే వ్యక్తి ఈ ముఠాలో సభ్యుడిగా ఉన్నట్లు గుర్తించారు. వీరు కొన్నేళ్లుగా ముఠాగా ఏర్పడి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి నష్టపోయారు. అప్పుల పాలు కావడంతో ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో మావోయిస్టుల పేరుతో తుపాకులు చూపించి వ్యాపారులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేసేవారు. అదే అనుభవంతో వీరు ముగ్గురు ఆయుధాల కోసం బీహార్‌కు వెళ్లి అక్కడ ఆయుధాలు కొనుగోలు చేసేందుకు ప్రయత్నించి తిరిగి వచ్చారు. 11 నెలల క్రితం వీరి ముఠా సభ్యుడైన మహ్మద్ రియాజ్‌ను బీహార్‌కు పంపించి పిస్టళ్లు–3, మ్యాగ్జిన్లు–4, బుల్లెట్లు–17ను తెప్పించి దందాలను ప్రారంభించారు. ఈ క్రమంలో అప్సర్, గుండమల్ల వెంకటేశ్వర్లు కలిసి ముదిగొండ ప్రాంతంలో గ్రానైట్ వ్యాపారుల వద్దకు వెళ్లి మావోయిస్టులమని బెదిరించి డబ్బులు వసూలు చేద్దామని వెళ్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వీరిలో మహ్మద్ అప్సర్‌పైన 2016లో గార్ల, 2013లో మరిపెడ, మహబుబాబాద్ టౌన్ పీఎస్‌లలో అక్రమ ఆయుధాలు, వసూళ్ల కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా వెంకటేశ్వర్లుపై 2001లో ఖమ్మం త్రీటౌన్, 2007లో గార్ల, మహబుబాబాద్ టౌన్ పీఎస్‌లలో అక్రమ ఆయుధాలు, ఎక్స్‌టోర్షన్ కేసులు నమోదయ్యాయి. పరారీలో ఉన్న మరో నిందితుడు రియాజ్‌పై 2013లో ఖమ్మం వన్‌టౌన్ పీఎస్‌లో అక్రమ ఆయుధాల కేసులు నమోదయ్యాయి. కాగా, నిందితులను విచారిస్తున్నామని, మరిన్ని వివరాలు విచారణలో తెలుతాయని సీపీ తెలిపారు. ఏసీపీ రమణమూర్తి, సీఐ రమేష్, ఎస్‌ఐ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో అన్ని పనులకూ అంగన్‌వాడీ టీచర్ల సేవలను వినియోగించుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. వారి రెక్కల కష్టానికి మాత్రం సరైన వేతనం ఇవ్వడం లేదు. మురిపిస్తూ మూడు నెలలు మాత్రమే ఉన్నతీకరణ వేతనాలను అందించిన ప్రభుత్వం.. తొమ్మిది నెలలుగా వారికి పాత జీతాలనే జమ చేస్తూ వారి శ్రమను దోచుకుంటోంది. మెయిన్ కేంద్రాల్లో రెక్కలు ముక్కలు చేసుకుంటున్న అంగన్‌వాడీలు.. మినీ కేంద్రాల జీతాలే పొందుతూ శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ధర్నాలు, రాస్తారోకోలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చివరికి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి గోడు వెళ్లబోసుకున్నా ఫలితం శూన్యంగానే మిగిలింది. దీంతో భద్రాద్రి జిల్లాలోని 626 మంది అంగన్‌వాడీ టీచర్ల కుటుంబాలు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

-భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ)

# 9 నెలలుగా పాత జీతాలే..


అంగన్‌వాడీల ఉన్నతీకరణ వేతనాలు 3 నెలల ముచ్చటేనా?

'అప్‌గ్రేడెడ్' అంగన్‌వాడీ టీచర్లను పట్టించుకోని ప్రభుత్వం

'మెయిన్'లో పనిచేస్తూ 'మినీ' సాలరీలే పొందుతున్న టీచర్లు

ధర్నాలు చేసినా, ముఖ్యమంత్రిని కలిసినా ఫలితం మాత్రం శూన్యం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 626 మందికి చేకూరని లబ్ధి



మినీ అంగన్‌వాడీ టీచర్లకు మెయిన్ టీచర్ల మాదిరిగా వేతనాలు ఇవ్వాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి హైదరాబాద్‌లో వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు (ఫైల్)

గ్రామస్థాయి పాలనలో ఏళ్లకేళ్లుగా అందుతున్న అంగన్‌వాడీ టీచర్ల సేవలను గత కేసీఆర్ ప్రభుత్వం గుర్తించింది. అందుకు గుర్తింపుగా వారిని ఉన్నతీకరించాలని నిర్ణయించింది. అలాగే, అంగన్‌వాడీల సేవలను కూడా విస్తరించాలని సంకల్పించింది. ఇందుకుగాను మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ టీచర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రతిపాదనలు రూపొందించింది. ఆ తరువాత వచ్చిన కాంగ్రెస్ సర్కారు దానిని అమలు చేయడంలో చేతులెత్తేసింది. జనవరిలో మినీ టీచర్లను మెయిన్ టీచర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ జీవో జారీ చేసింది. పేరు కోసం మూడు నెలల పాటు ప్రధాన టీచర్ల వేతనాలు ఇచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ మళ్లీ పాత జీతాలనే ఇస్తోంది. దీంతో మెయిన్ టీచర్లయిన మినీ టీచర్లందరూ తొమ్మిది నెలలుగా సగం జీతాలతో సర్దుకోవాల్సి వస్తోంది. దీంతో ధర్నాలు, రాస్తారోకోలు చేసినా ప్రభుత్వం నుంచి స్పందన లేకుండా పోయింది. ఫలితంగా మళ్లీ మరోసారి రోడ్డెక్కేందుకు అంగన్‌వాడీలు సిద్ధమవుతున్నారు.

### పేరుకు మాత్రమే అప్‌గ్రేడ్..

జిల్లాలో ఇప్పటి వరకు 1,434 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కొన్ని చోట్ల చిన్న గ్రామాలు, తండాల్లో పిల్లలు ఉన్నందున మినీ అంగన్‌వాడీ కేంద్రాలను కూడా గత కేసీఆర్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆ తరువాత మారుతున్న జనాభా దృష్ట్యా మినీ సెంటర్లను కూడా మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని తీర్మానించింది. అమలు చేసే క్రమంలో కొత్త ప్రభుత్వం వచ్చింది. వచ్చీరాగానే ఈ ప్రతిపాదనను మూలనపడేసింది. ఆ తరువాత అంగన్‌వాడీ టీచర్ల పోరాటానికి స్పందించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేస్తూ జనవరిలో జీవో జారీ చేసింది. అప్పటి నుంచి మూడు నెలలపాటు మినీ టీచర్లకు కూడా మెయిన్ టీచర్ల వేతనాలు చెల్లించింది. ఆ తరువాత దానిని ఆ మూడు నెలల ముచ్చటగానే మిగిల్చింది. ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇవ్వలేదంటూ అప్పటి నుంచి ఇప్పటి వరకూ తొమ్మిది నెలల పాటు మళ్లీ పాత వేతనాలనే అంటే మినీ అంగన్‌వాడీలకు ఇచ్చే వేతనాలే జమ చేస్తోంది.

### 626 మందికి చేకూరని లబ్ధి..

జిల్లా వ్యాప్తంగా 626 మంది మినీ టీచర్లకు లబ్ధి చేకూరలేదు. మినీ టీచర్లకు రూ.7,500, మెయిన్ టీచర్లకు రూ.13,500 చొప్పున ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తోంది. 626 మంది మినీ టీచర్లు మెయిన్ టీచర్లుగా అప్‌గ్రేడ్ అయినందున వారికి కూడా నెలకు రూ.13,500 చొప్పున వేతనాలు చెల్లించాల్సి ఉంది. కానీ తొమ్మిది నెలలుగా రూ.7,500 చొప్పునే వేతనాలు చెల్లిస్తూ వారి శ్రమను దోపిడీ చేస్తోంది. ఆయాల నియామకం కూడా లేకపోవడంతో అంగన్‌వాడీలే అన్ని పనులూ చక్కదిద్దుకోవాల్సి వస్తోంది. ఇటు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం వండి పెట్టడంతోపాటు ప్రభుత్వం అప్పగించిన మిగతా పనులనూ చేయాల్సి వస్తోంది. ముఖ్యంగా ఎన్నికల విధులు, సర్వే పనుల వల్ల ఆదివారమూ వారికి విశ్రాంతి లేకుండా పోతోంది.



### అప్‌గ్రేడ్ చేసినా జీతాలు ఇవ్వడం లేదు..

మినీ అంగన్‌వాడీలుగా ఉన్న మమ్మల్ని మెయిన్ అంగన్‌వాడీలుగా ఎప్పుడో అప్‌గ్రేడ్ చేశారు. మొదటి మూడు నెలలు మాత్రమే మెయిన్ టీచర్లతో సమానమైన వేతనాలు ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ 9 నెలలుగా మినీ అంగన్‌వాడీల వేతనాలే ఇస్తున్నారు. పని భారం ఎక్కువగా, వేతనం తక్కువగా ఉంటోంది.

–దేవి, అంగన్‌వాడీ టీచర్, లక్ష్మీదేవిపల్లి



### పోరాటాలు చేస్తూనే ఉన్నాం..

కొత్త ప్రభుత్వంలో ఉపయోగం లేదు. అంగన్‌వాడీ టీచర్లపై చిన్నచూపు చూస్తున్నారు. అదనపు పనులన్నీ చేయిస్తున్నారు. వేతనాలు మాత్రం చాలా తక్కువగా ఇస్తున్నారు. మంత్రులకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. మళ్లీ రోడ్డెక్కాల్సి వస్తుందని అనుకుంటున్నాం.

–జీ.పద్మ, అంగన్‌వాడీ టీచర్, సీఐటీయూ నాయకురాలు



### ప్రత్యేక బడ్జెట్‌తో వేతనాలు..

మినీ అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లను ప్రభుత్వం మెయిన్ టీచర్లుగా అప్‌గ్రేడ్ చేసింది. వేతనాలది చిన్న సమస్య. ప్రత్యేక బడ్జెట్ ఇస్తున్నారు. దాని ప్రకారం వచ్చే నెల నుంచి మినీ టీచర్లకు కూడా మెయిన్ టీచర్లతో సమానమైన వేతనాలు వస్తాయి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎలాంటి ఇబ్బందీ ఉండదు.

–స్వర్ణలత లెనీనా, జిల్లా సంక్షేమ అధికారి, భద్రాద్రి జిల్లా

# పది రోజులైనా కాంటాలు వేయరా?

- ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలనలో మాజీ ఎమ్మెల్యే సండ్ర
- సీసీఐ కేంద్రాలూ వ్యాపారులకే అనుకూలమంటూ విమర్శ

వైరా టౌన్ (తల్లాడ), నవంబర్ 17: 'ధాన్యం తెచ్చి పది రోజులవుతున్నా ఇంకా కాంటాలు వేయరా?' అంటూ సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రశ్నించారు. రోజుల తరబడి కాంటాలు వేయకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లాడ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సండ్ర వెంకటవీరయ్య ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలను విరివిగా పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ఇబ్బందుల దృష్ట్యా వెంటనే కాంటాలు వేసి కొనుగోళ్లు పూర్తి చేయాలని, ప్రైవేటు వ్యాపారులకు రైతులు అమ్మిన ధాన్యానికీ రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద కూడా తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదని అన్నారు. ప్రైవేటు వ్యాపారులకు అనుకూలంగా సీసీఐ కేంద్రాలు పనిచేస్తున్నాయని మండిపడ్డారు. పత్తి రైతులకు ఇబ్బందులు కలగకుండా సీసీఐ కేంద్రాలకు తెచ్చిన పత్తిని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు.



తల్లాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

# ఎస్టీ కమిషన్‌కు కవిత, హరిప్రియ

లగచర్ల రైతుల పక్షాన ఫిర్యాదు చేసేందుకు ఢిల్లీకి..

ఇల్లెందు, నవంబర్ 17: గిరిజన బిడ్డలైన లగచర్ల రైతుల పక్షాన పోరాడేందుకు మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ సిద్ధమయ్యారు. బాధిత రైతులకు జరిగిన అన్యాయంపై ఎస్టీ కమిషన్‌లో ఫిర్యాదు చేసేందుకు ఆదివారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజనుల సాగు భూములను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం లాక్కొని ఫార్మా కంపెనీకి కట్టబెట్టాలని చూస్తోందని ఆరోపించారు. దీంతో గిరిజనులకు అండగా ఉండి వారి పక్షాన పోరాడుతామని తెలిపారు. వారి వెంట కూవ లక్ష్మి తదితరులు ఉన్నారు.




ఎయిర్‌పోర్ట్ వద్ద మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, మాజీ ఎంపీ మాలోత్ కవిత

'స్థానికం'లో రిజర్వేషన్ అమలుపై

# ప్రభుత్వానికి నివేదిస్తాం

- బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు
- ఉమ్మడి జిల్లాల సంఘాలు, ప్రతినిధుల అభిప్రాయాల సేకరణ



అభిప్రాయాలు సేకరిస్తున్న కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు

మామిళ్లగూడెం, నవంబర్ 17: స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు వివిధ సంఘాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను క్రోడీకరించి నివేదికను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నిర్ణీత సమయంలో సమర్పిస్తామని బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్సు హాల్‌లో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల వర్తింపు అంశంపై ఉమ్మడి జిల్లా పరిధిలోని నిర్వహించిన బహిరంగ విచారణలో కమిషన్ చైర్మన్, కార్యదర్శి సైదులు, ఖమ్మం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. మొదట కలెక్టరేట్ ఆవరణలో రిజిస్ట్రేషన్ సెంటర్, నమోదు కేంద్రాన్ని కమిషన్ చైర్మన్ పరిశీలించారు. అనంతరం వివిధ సంఘాలు, వ్యక్తుల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. కమిషన్ చైర్మన్‌కు వడ్డెర సంఘం, సంచార జాతుల, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ, ముస్లిం మైనార్టీ, మత్స్యకారుల, ఆల్ ఇండియా ఓబీసీ కులాల, పూసల, చాకలి, దూదేకుల, యాదవ, గొల్ల కురుమ, సంచార ముస్లిం, కుమ్మరి, ఎంబీసీ సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను తెలుపుతూ వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు దమాషా ఖరారు చేసేందుకు ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలో జనాభా వివరాలు వెల్లడించాలని, స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల కోసం అభిప్రాయ సేకరణ చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ ఉప సంచాలకులు వి.రమేష్, ఖమ్మం జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి జ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీసీ సంక్షేమాధికారి ఇందిర, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, సహాయ బీసీ సంక్షేమాధికారులు ఈదయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'గ్రూప్-3'కి భారీగా తగ్గిన అభ్యర్థులు

- 'భద్రాద్రి'లో 13,478 మందికి గాను 7,238 మందే హాజరు
- 6,244 మంది గైర్హాజరుతో 53.67 శాతం హాజరు నమోదు
- ఖమ్మంలో హాజరు శాతాన్ని వెల్లడించని అధికారులు
- ఉమ్మడి జిల్లాలో మొదటి రోజు ప్రశాంతంగా పరీక్ష
- పోలీసుల పటిష్ట బందోబస్తు.. పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ, సీపీ



కొత్తగూడెంలో కలెక్టర్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు



ఖమ్మంలో ఓ పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు

మామిళ్లగూడెం/ కొత్తగూడెం ఎడ్యుకేషన్/ పాల్వంచ/ పాల్వంచ రూరల్/ కొణిజర్ల, నవంబర్ 17: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో చేపట్టిన గ్రూప్–3 పరీక్షల ప్రక్రియ మొదటి రోజు ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. అయితే, అభ్యర్థుల హాజరు శాతం భద్రాద్రి జిల్లాలో భారీగా తగ్గింది. అయితే, ఖమ్మం జిల్లాలో ఎంతమంది హాజరయ్యారన్న వివరాలను అధికారులు వెల్లడించలేదు. భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో కలిపి 39 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. మొత్తం 13,478 మందికి హాల్‌టికెట్లు జారీ చేయగా 7,238 మంది హాజరయ్యారు. 6,244 మంది గైర్హాజరయ్యారు. మొత్తమ్మీద 53.67 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు తెలిపారు. అయితే, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. పరీక్ష సమయానికి అరగంట ముందుగానే అభ్యర్థులు చేరుకోవడంతో బయోమెట్రిక్ విధానం ద్వారా వారిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించలేదు. ఇక ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 87 పరీక్షా కేంద్రాల్లో ఎగ్జామ్ రాసేందుకు అభ్యర్థులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. 27,984 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంది. అయితే, జిల్లాలో విద్యార్థుల హాజరు శాతాన్ని వెల్లడించేందుకు టీజీపీఎస్సీ అధికారుల అనుమతి లభించలేదు. రాష్ట్రస్థాయిలో టీజీపీఎస్సీనే హాజరు శాతాన్ని ప్రకటిస్తుందని అధికారిక వర్గాలు తెలిపాయి. మొదటి సెషన్‌కు ఉదయం 8:30 గంటల నుంచే అధికారులు పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల పరీక్ష జరిగింది. రెండో సెషన్‌లో 1:30 నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. సాయంత్రం 5:30కు పరీక్ష ముగిసింది. ప్రతి హాల్‌లో 24 మంది అభ్యర్థులకు మాత్రమే సీటింగ్ ఏర్పాటు చేశారు. కాగా, సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకూ మూడో పేపర్ పరీక్ష జరుగనుంది.




పాల్వంచ: ఆలస్యంగా వచ్చిన అభ్యర్థి (పైన), పరుగున వస్తున్న అభ్యర్థి (కింద)



కొత్తగూడెంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ

### పరీక్షా కేంద్రాల్లో కలెక్టర్, ఎస్పీ, సీపీ తనిఖీ..

భద్రాద్రి జిల్లాలో గ్రూప్–3 పరీక్ష కేంద్రాలను కలెక్టర్ జితేశ్ వి పాటిల్ వసంత్, ఎస్పీ రోహిత్‌రాజు వేర్వేరుగా తనిఖీ చేశారు. రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, మహిళా డిగ్రీ కాలేజీ, అనుబోస్ ఇంజినీరింగ్ కాలేజీ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. రుద్రంపూర్‌లోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల కేంద్రాన్ని ఎస్పీ రోహిత్‌రాజు తనిఖీ చేశారు. కొత్తగూడెంలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న కలెక్టర్‌ను కూడా పోలీసులు తనిఖీ చేసి అనుమతించారు. ఇక ఖమ్మంలోని పలు పరీక్ష కేంద్రాలను సీపీ సునీల్‌దత్ పరిశీలించి అధికారులకు సూచనలు జారీ చేశారు. హాల్ టికెట్లలో పరీక్ష కేంద్రాల చిరునామా తప్పుగా ప్రచురితం కావడంతో పాల్వంచ మండలంలో కొందరు అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. కాగా, మణుగూరుకు చెందిన నాగవేణి పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష రాయాల్సి ఉంది. సమయం దాటిపోయాక రావడంతో అధికారులు ఆమెను అనుమతించలేదు. దీంతో నిరాశగా వెనుతిరిగింది.



ఖమ్మంలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

# పేట్రేగిపోతున్న ఇసుక మాఫియా

బూర్గంపహాడ్, నవంబర్ 17: బూర్గంపహాడ్ మండలంలో ఇసుక మాఫియా ఆగడాలు పేట్రేగిపోతున్నాయి. అక్రమార్కులందరూ మాఫియాగా ఏర్పడి రాత్రీ పగలూ తేడా లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తొలుత బెదిరింపులకు దిగుతున్నారు. ఆపై దాడులకు పాల్పడుతున్నారు. చివరికి అడ్డుకోబోయిన అధికారులపై కూడా దాడులు తెగబడే పరిస్థితికి వచ్చారు. ఇటీవల ప్రశ్నించిన ఓ మీడియా ప్రతినిధిని కూడా ఇసుక మాఫియా వ్యక్తులు ఇటీవల దూషించిన విషయం విదితమే. దీంతో అతడి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. ఈ క్రమంలో తహసీల్దార్ తమ సిబ్బందితో వెళ్లి ఇసుక రవాణా జరుగుతున్న ప్రాంతాల్లో కందకాలు తీయించారు. అయినా ఇసుక మాఫియా కొత్త మార్గాల్లో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూనే ఉంది.




దాడి చేసేందుకు ఇసుక మాఫియా తెచ్చుకున్న కర్రలను చూపుతున్న రెవెన్యూ సిబ్బంది (ఇన్‌సెట్‌లో) దాడికి ప్రయత్నించిన వ్యక్తి

### ప్రశ్నించే వారిపై బెదిరింపులు, దాడులు

అక్రమ రవాణాపై అధికారులకు సమాచారం ఇచ్చిన వారిపైనా ఇసుక మాఫియా బెదిరింపులు, దాడులకు దిగడం పరిపాటిగా మారింది. ఇసుక రవాణాను అడ్డుకునేందుకు రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖలు కలిసి పనిచేయాల్సి ఉంది. అయితే ఈ శాఖల మధ్య ఉన్న సమన్వయలోపం కారణంగా ఇసుక మాఫియా మరింత రెచ్చిపోతోంది. తాజాగా సారపాక బ్రిడ్జి కింద ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు రెవెన్యూ అధికారులు వెళ్లారు. వారు ఘటనా ప్రదేశానికి చేరుకోగా గుంపుగా ఉన్న వారందరూ పారిపోయారు. అందులో ఓ వ్యక్తి ఆర్‌ఐ కాళ్లను లాగడంతో ఆయన కిందపడిపోయాడు. ఆర్‌ఐ కాలికి గాయమైంది. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించినా వారు సకాలంలో రాలేదనే వాదనలు ఉన్నాయి. దీంతో 100కు కాల్‌చేసి సమాచారం అందించినట్లు చెబుతుండడం గమనార్హం. అయితే, రెవెన్యూ అధికారులే తమకు సమాచారం ఇవ్వకుండా వెళ్తున్నారని పోలీసులు అంటుండడం ఆ రెండు శాఖల మధ్య సమన్వయలోపాన్ని తెలియజేస్తోంది.

- ప్రశ్నించే వారిపై దాడులు, బెదిరింపులు
- తాజాగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పైనే దాడి
- పోలీసుల అదుపులో మాఫియా వ్యక్తి
- ట్రాక్టర్ సహా 'దాడి' కర్రల స్వాధీనం

### ఆర్‌ఐపై ఇసుక మాఫియా దాడి..

సారపాకలో బ్రిడ్జి కింద శనివారం అర్ధరాత్రి సమయంలో ఇసుక రవాణా జోరుగా జరుగుతోందన్న సమాచారం రెవెన్యూ అధికారులకు అందింది. వారు పోలీసులకు కూడా సమాచారం ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ ఆదేశాల మేరకు డీటీ రాంనరేశ్, ఆర్‌ఐ–1 ముత్తయ్య, రెవెన్యూ సిబ్బంది కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. భాస్కర్‌నగర్, గాంధీనగర్‌లకు చెందిన ఇసుక మాఫియా సభ్యులు అప్పటికే అక్కడ ఉన్నారు. రెవెన్యూ అధికారులు వెళ్లగానే ఆ ఇసుక మాఫియా సభ్యులు కర్రలతో ఆర్‌ఐపై దాడికి యత్నించారు. వారిని పట్టుకుంటున్న క్రమంలో ఆర్‌ఐ కాళ్లను ఇసుక మాఫియా సభ్యులు లాగారు. దీంతో ఆయన కింద పడడంతో అతడి కాలికి గాయమైంది. మిగతా అధికారులు అక్కడే ఉన్న ఓ వ్యక్తిని పట్టుకొని వివరాలు సేకరించారు. ఓ ట్రాక్టర్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. దాడికి ఉపయోగించిన కర్రలను, ఇసుక రవాణాకు ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.